www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 నవంబర్ 2023
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



రైతులకు అండగా వైసిపి ప్రభుత్వం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మండపేట

వైసిపి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మండపేట పురపాలక సంఘం ఛైర్పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. మండపేట వల్లూరి అప్పారావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు పెంకె గంగాధరం అధ్యక్షత వహించారు. వైసిపి రైతు విభాగం రాష్ట్ర కన్వీనర్, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ,ముత్యాలయ్య సొసైటీ సిఇఒ చిర్ల సుబ్రహ్మణ్యం, [illegible] పాల్గొన్నారు.

వనరులున్నా.. అభివృద్ధి సున్నా..

- కోనసీమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నమోడీ
- బిజెపికి వైసిపి, టిడిపి,జనసేన పార్టీల మద్దతు సిగ్గుచేటు
- ప్రజారక్షణ భేరి యాత్రలో వక్తలు



అమలాపురంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు



సభకు హాజరైన జనం

ప్రజాశక్తి - అమలాపురం, రాజమహేంద్రవరం ప్రతినిధి

కోనసీమలో అపారమైన వనరులున్నా ఇక్కడ అభివృద్ధి మాత్రం జరగలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే దీనికి కారణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ బేరి బస్సు యాత్ర మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సాగింది. మండపేట కలువపువ్వు సెంటర్ వద్ద సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణవేణి తదితరులు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రావులపాలెం మీదుగా యాత్ర అమలాపురం చేరుకుంది. అమలాపురం నుంచి రాజోలు వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట కలువ పువ్వు సెంటర్, రావులపాలెం ఎంపిడిఒ కార్యాలయం వద్ద, అమలాపురం హైస్కూల్ సెంటర్ వద్ద బహిరంగ సభలు నిర్వహించారు.

ఈ సభలకు సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడారు. కోనసీమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదన్నారు.కోనసీమ జిల్లాకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరు పెట్టాలని తొలత ప్రతిపాదించింది సిపిఎం మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. అమలాపురంలో జరిగిన అల్లర్లలో బిజెపి, ఆర్ఎస్ఎస్ హస్తం ఉందన్నారు. ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు అవి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేరళ ప్రభుత్వం దిక్సూచీగా ఉందన్నారు. అన్ని నిత్యావసర సరుకులను అక్కడ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తుందన్నారు. కొబ్బరి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. అనంతరం ప్రజా ప్రణాళికను ప్రజలకు పరిచయం చేశారు. ఈ ప్రణాళిక అమలుకు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల హక్కులను కాలరాసిందన్నారు. కార్పొరేషన్లకు రూపాయి కూడా కేటాయించకుండా మొండి చేయి చూపిందన్నారు. దళితులపై దాడులు చేస్తూ సామాజిక సాధికార యాత్ర చేయడం శోచనీయమని అన్నారు. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. జిల్లాలో కనీస వైద్య సౌకర్యాలు లేవన్నారు. ఏరియా ఆసుపత్రిలో వైద్యం లభించక కాకినాడ లేదా రాజమహేంద్రవరం ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఏరియా ఆసుపత్రిని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. మెడికల్ కళాశాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిత్యం గ్యాస్ పైప్ లైన్ల లీకేజీలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. చమురు సంస్థల సిఎస్ఆర్ నిధులను ఈ జిల్లాలోనే ఖర్చు చేయాలన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. అక్రమ ఆక్వా చెరువులకు అడ్డుకట్ట వేయాలన్నారు. తాండవపల్లిలో ఆక్వా వ్యర్థాల కారణంగా అక్కడి ప్రజలు కేన్సర్, అంధత్వం, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఇసుక అందుబాటులోకి తేవాలన్నారు. కొబ్బరి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. కౌలురైతులందరికీ కార్డులు ఇవ్వాలని, పంట కాలువల ఆధునికీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర నాయకులు హరిబాబు, కొల్లాటి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, బలరాం, కృష్ణవేణి, నాగవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇసుక ర్యాంపు కార్మికులు, కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులు, యుటిఎఫ్ నాయకులు, అంగన్‌వాడీలు సమస్యలపై యాత్ర బృందానికి వినతిపత్రాలను అందించారు.



కొబ్బరి ఒలుపు కార్మికులతో సిపిఎం నాయకులు

అబ్బురపరిచిన కళాకారుల ప్రదర్శనలు

ప్రజా రక్షణ బేరి యాత్రలో భాగంగా కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. మండపేట ,రావులపాలెం ,అమలాపురం వేదికలపై కళాకారులు కళా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రయివేటీకరణ, మతోన్మాదం, నిరుద్యోగ సమస్యలు, అధిక ధరలు వివరిస్తూ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఎర్రజెండా గొప్పతనాన్ని వివరిస్తూ పాటలతో ఆహుతులను ఉత్తేజపరిచారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన అనుసరిస్తున్న విధానాలను మోడీ దుర్మార్గాలను ఎండగట్టే విధంగా ప్రదర్శించిన 'మూడు ముక్కలాట' లఘు నాటిక ఆలోచింపజేసింది. 'పన్నులు బాబోయ్ పన్నులు' లఘునాటిక పాలకుల అడ్డగోలు పన్నుల విధానాన్ని ఎండగట్టింది. రండి కదలి రండి చలో విజయవాడ ఏలేటి వాళ్ళ తీరును చూడు అంటూ నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మెరక పనుల ముసుగులో అక్రమ మైనింగ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండపేట మండలం కేశవరంలో జగనన్న కాలనీల మెరక పనుల ముసుగులో అక్రమ మైనింగ్ ద్వారా రోజుకు రూ.70లక్షలు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అక్రమార్జన చేస్తున్నారని ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన కో-ఆర్డినేటర్ ఇంఛార్జి వేగుళ్ళ లీలా కృష్ణలు ఆరోపించారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరులో లీలా కృష్ణ స్వగృహంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి, జనసేన శ్రేణులతో క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కేశవరం వెళ్ళే ప్రయత్నంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారని ఎంఎల్‌ఎ వేగుళ్ల, జనసేన పార్టీ ఇంచార్జి లీలా కృష్ణలు మీడియా సమావేశంలో తెలిపారు. నాలుగు రోజుల్లో పూర్తయ్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని కేశవరం గ్రామంలో 9 రోజులుగా ఎంఎల్‌సి తోట తిరిగిరాని దానికి కారణం కేవలం అక్రమ గ్రావెల్ దోచుకోవడానికేనని వారు ఆరోపించారు. ఇప్పటికయినా కేశవరం గ్రామం నుంచి తరలిస్తున్న గ్రావెల్ ను మండపేట నియోజక వర్గంలో ఏ జగనన్న కాలనీలో మెరక పనులు చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన నాయకులతో కేశవరం లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అడ్డుకునేందుకు బయలుదేరే క్రమంలో రామచంద్రపురం డిఎస్‌పి పర్యవేక్షణలో సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బందితో ఎంఎల్‌ఎ వేగుళ్ళను, జనసేన పార్టీ లీలా కృష్ణ ను తదితరులను అరెస్టు చేసి అంగర పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఎంఎల్ఎ హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి-మండపేట

కేశవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామన్న సాకుతో రోజుకు 1500 వందల లారీలతో గ్రావెల్ మట్టిని అక్రమంగా అమ్ముకుంటూ ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూరుస్తున్నారని ఆయన అన్నారు. ఈ విషయంపై అధికారులు తగు సమాచారం ఇవ్వకపోవడంతో ఎంఎల్‌ఎ వేగుళ్ల వాటిని పరిశీలించేందుకు మంగళవారం ఉదయం పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనను ఉదయం హౌస్ అరెస్ట్ చేసి 10 గంటలకు విడిచి పెట్టారు. అక్కడ నుంచి ఆయన కపిలేశ్వరపురం మండలంలో వల్లూరు వెళ్లారు. తమ ఇళ్ల స్థలాలకు అడ్డుపడవద్దంటూ మండలంలోని కేశవరం గ్రామంలో ఇళ్ల పట్టాదారులు మంగళవారం ఆందోళన చేపట్టారు.

'శాలివాహన' మండల నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి- రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారామలో శాలివాహన కుమ్మరి సంక్షేమ సంఘం నూతన మండల కార్యవర్గం మంగళవారం ఎంపిక చేశారు. కోనసీమ జిల్లా అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం ప్రధాన కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వర రావు , ర్యాలీ శ్రీనివాస్ వడియార్ కోటిపల్లి సత్యనారాయణ ల ఆధ్వర్యంలో రామచంద్రపురం మండలం కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా దాలిపర్తి పాపారావు, అధ్యక్షులుగా మాగాపు శ్రీనివాసరావు వైస్ ప్రెసిడెంట్ కోటిపల్లి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఏడిద వీరబాబు, కోశాధికారి పేరూరి వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ మండా దుర్గారావు తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.




ఒఎన్‌జిసిఅధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హామీలు నెరవేర్చలేదని నిలదీత

ప్రజాశక్తి-రాజోలు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పొన్నమండ అంబేద్కర్ విజ్ఞాన సమితి సభ్యులు ఒఎన్‌జిసి అధికారులను నిలదీశారు. సెయింట్ ఫాల్స్ లూథరన్ చర్చి రోడ్డు వేయాలని ఎన్ని సార్లు అడిగినా ఒఎన్‌జిసి అధికారులు పట్టించుకోవడం లేదని అంబేద్కర్ విజ్ఞాన సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒఎన్‌జిసి అధికారులతో చర్చలు జరిపి అనంతరం వినతిపత్రం అందించారు. గతంలో కూడా అంబేద్కర్ విజ్ఞాన సమితికి కంప్యూటర్స్, ఫర్నీచర్ అంద చేస్తామని ,అలాగే ఫీల్డ్ లేబర్ సొసైటీ కు అనుబంధ భవనానికి సియస్ఆర్ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా.. అవి నెరవేరలేదని విజ్ఞాన సమితి సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. 2020 సంవత్సరం నుండి రాజమహేంద్రవరం ప్రధాన కార్యాలయానికి ఎన్నో సార్లు వెళ్ళి తమ సమస్యలను వివరించామన్నారు. తమకు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ఫీల్డ్ లేబర్ సొసైటీ అధ్యక్షులు కుసుమ రాజ్ కుమార్ అధికారులను నిలదీశారు. దీంతో ఒఎన్‌జిసి అధికారులు స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చేలా తప్పకుండా కార్యాచరణ చేస్తామని అన్నారు.కార్యక్రమంలో బత్తుల మురళీ కృష్ణ, మోకా ఉష ఏడు కొండలు, మోకా ఇశ్రేయేలు దాకే ఏడుకొండలు, మోకా దిలీప్, సంఘం పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్న ఎంపీ, జిల్లా జెసి తదితరులు

ప్రజాశక్తి-అమలాపురం

దేశానికి వెన్నెముక అయిన రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని, పలు చారిత్రాత్మకమైన సంస్కరణలను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టి రైతులకు భరోసా అండగా నిలుస్తోందని ఎంపీ చింత అనురాధ పేర్కొన్నారు.మంగళవారం సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్ర మంలో సిఎం జగన్ బటన్ నొక్కి వరుసగా ఐదో ఏడాది రెండో విడత నిధులను రూ.4 వేలు చొప్పున అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని జమచేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో పార్లమెంట్ సభ్యులు, జాయింట్ కలెక్టర్, అధికారులు రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలు రైతన్న గడప వద్దనే అందించే దిశగా వన్ స్టాప్ సెంటర్లుగా రైతు భరోసా కేంద్రా లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా టు చేసిందన్నారు. వివిధ రకాల సేవలు ఆర్‌బికెల ద్వారా అందు బాటులోకి వచ్చాయన్నారు. గడచిన అయిదేళ్లగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం నిధులను చెల్లించడం జరుగు తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ 7,500లు కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు లు ఈ పథకానికి సమకూరుస్తున్నాయన్నారు. సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ కౌలు రైతులు, అటవీ, దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు వైయస్సార్ రైతు భరోసా-పిఎం కిసాన్ కింద పంట పెట్టుబడి ఖర్చుల భారాన్ని తగ్గించేం దుకు ఏటా మూడు విడతలలో మొత్తం రూ.13500 సాయాన్ని ప్రభుత్వాలు అందిస్తున్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తం గా ఈ ఏడాది రెండో విడతగా 1,65,382 మంది రైతన్నలకు రూ.4 వేల చొప్పున మొత్తం రూ. 68 కోట్ల 3 లక్షలు అందించారన్నారు. ఇ-క్రాప్, ఇ-కెవైసి ఆధారంగా రూపొందించిన వెబ్ ల్యాండ్ ఆధారంగా వ్యవసాయం చేస్తున్న భూమి యజమానులతో పాటు పంట సాగు హక్కు ప్రతాలున్న రైతులకు కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకాన్ని అందజేస్తోం దన్నారు. సాగు కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి రాకుండా ఈ రైతు భరోసా నిధులు రైతాంగానికి ఎంతో మేలు చేకూర్చుస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యులు జిన్నూరి రామారావు, జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి, ఎంపిపి కుడిపూడి భాగ్యలక్ష్మి, ఉద్యాన బోర్డు సభ్యుడు వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలమణి రుద్ర, పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు ఎడిలు నాగేశ్వరరావు వెంకట రామారావు, షంషి, పలువురు జెడ్‌పిటిసి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నాసా పోటీ పరీక్షలకు ఎంపికైన విద్యార్థులతో ప్రినిపల్, ఉపాధ్యాయులు

నాసా స్పేస్ ప్రాజెక్టుకు శ్రీ చైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంతర్జాతీయ పరిశోధనా సంస్థ నాసా స్పేస్ ప్రాజెక్టు వర్క్‌కు ద్రాక్షారామ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు 13 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ గ్రంధి లీలా వంశీకృష్ణ తెలియజేశారు. మంగళవారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2023-2024కు నాసా ప్రాజెక్ట్ వర్క్‌లో పాల్గొనే విద్యార్థులకు సైంటిస్ట్ దేవరకొండ అంగీరస అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి విద్యార్థులను ఇటువంటి పోటీలకు తయారుచేయటం వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు తోడ్పడుతుందన్నారు. లీలా వంశీ కృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్ లను ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేటివ్ సంస్థకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో జరిగే అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సుకు నేరుగా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఇంచార్జ్ ఎంవిఎల్.నరేష్ మాట్లాడుతూ పోటీలో పాల్గొనే విద్యార్థులకు నాసా బ్యాడ్జీ, టీ షర్టులు, పుస్తకాలు అందించారన్నారు. విద్యార్థులు మంచి పట్టుదలతో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కాకినాడలో ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జరిగిన ఎంపికలో వన్నె చింతలపూడి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి అల్లు మానస్ ప్రతిభ కనపరచి అండర్ -14 బాలుర బ్యాడ్మింటన్ విభాగానికి ఎంపికైనట్లు పాఠశాల పి.డి. కె.గణేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున మానస్ ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. స్థానిక సర్పంచ్ లు నక్కా రాజారత్న నాగవాణి, పరమట శ్యామ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు నాగ సత్యనారాయణ, విద్యా కమిటీ ఛైర్మన్ కుంచె వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ కరేళ్ళ జగదాంబ రమేష్ తదితరులు మానస్‌ను అభినందించారు.

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై వెంకన్న



చంద్రప్రభవాహనంపై శ్రీనివాసుడు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను మంగళవారం పండితులు రాజేశ్వర ఆచార్యులు ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్త కళశారాధన, వసంతోత్సవము, అష్టదళ పాద పద్మారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ సత్యనారాయణ రాజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ కృష్ణ అలంకరణలో సూర్య ప్రభ వాహనంపై వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. రాత్రి మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కోనేటి రాయుడు ఆలయ మాడవీధులలో విహరించారు.

సామాజిక బస్సు యాత్రకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

సిఎం జగన్ ప్రజల్లో మమేకం అయ్యేందుకు చేపట్టిన సామాజిక బస్సు యాత్రకు ఎస్‌లంతా సన్నద్ధం కావాలని పి.గన్నవరం ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం సిరిపల్లిలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి బయ్య చినబాబు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొంతు రాజేంద్రప్రసాద్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, తొత్తరముడి సర్పంచ్ వార జయసావిత్ర, మాగం సర్పంచ్ కాశి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బడుగువానిలంకలో మాట్లాడుతున్న సత్యానందరావు

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యార్యంటీ కార్యక్రమం మంగళవారం జరిగింది. వివరాలు ఇవి..

ఆలమూరు రాష్ట్రంలో బడుగువానిలంకలో 'బాబు ష్యూరిటీ' కార్యక్రమాన్ని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ ఇంఛార్జి బండారు సత్యానందరావు టిడిపి శ్రేణులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, దూలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు ఆధ్వర్యంలో పట్టణం 6వ వార్డు శీలంవారిసావరంలో నిర్వహించారు. టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. **మామిడికుదురు** పెదపట్నంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొమ్ముల నందు బాబు, గాదె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు

ఓట్ల తొలగింపు వివరాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కొత్తపేట

ఓట్లు తొలగింపు సంబంధించి జారీ చేస్తున్న నోటీసుల వివరాలను రాజకీయ పార్టీలకు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ముక్కంటిని టిడిపి, బిజెపి, జనసేన ప్రతినిధులు కోరారు. నియోజకవర్గం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ముక్కంటి అధ్యక్షతన సమావేశం జరిగింది. అసెంబ్లీ పరిధిలో ఓటర్ ముసాయిదా సంబంధించి 2,45,355 ఓటర్లుగా అక్టోబర్ 27న విడుదలైన జాబితాలో పేర్కొన్నారని,. ఈ జాబితాకు అదనంగా 5,350 పైబడి పెండింగ్లో ఉన్నాయని చెబుతున్నారని, వాటి వివరాలు అందించాలని టిడిపి, బిజెపి, జనసేన ప్రతినిధులు రిటర్నింగ్ అధికారిని కోరారు. కొత్తపేట నియోజక వర్గంలో 4,5 తేదీల్లో నిర్వహించిన ఓటర్ డ్రైవ్ కార్యక్రమంలో పలుచోట్ల బిఎల్‌ఒలు పాల్గొన్న లేదని ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఫారం 7 సంబంధించి జారీ చేస్తున్న నోటీసుల్లో ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులకే ఎక్కువగా నోటీసులు అందుతున్నాయన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ స్థానిక ఎంఎల్‌ఎ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నోటీస్‌లు జారీ చేయడం నిబంధనలను అతిక్రమించడం అని తెలిపారు. ఫారం సెవెన్ సంబంధించి సంబంధిత బూత్ లో ఓటర్ ఫిర్యాదు చేయవలసి ఉండగా, బయట వ్యక్తులు ఫిర్యాదుల ఆధారంగా చర్యలు చేపట్టడం తగదన్నారు. సమావేశంలో టిడిపి ప్రతినిధి ముత్యాల బాబ్జి, బిజెపి ప్రతినిధి పాలూరు సత్యానందం, జనసేన ప్రతినిధి కంఠం శెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు..

6వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్లలో దేవీ ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన మంగళవారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా స్థానిక శ్రీకనక మహాలక్ష్మి సెంటర్ వద్ద అమ్మవారి నవరాత్రి నిర్వహిస్తామన్నారు. అన్న సమారాధనలో ఆరువేల మందికి పైగా యాత్రికులు పాల్గొన్నారు.

యనమదల్లో 'స్వచ్ఛత మన బాధ్యత'

ప్రజాశక్తి-రామచంద్రపురం

యనమదల గ్రామంలో స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పివివి.రమణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పిచ్చి మొక్కలను తొలగించి డ్రైన్లను శుభ్రపరిచారు. చెత్తనంతా ఒకే చోట నుంచి పూడ్చిపెట్టారు. సర్పంచ్ తో పాటు ఎంపిటిసి సభ్యు లు శ్రీరామకృష్ణ, ఉప సర్పంచ్ శివ, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిధిలో దోమల నిర్మూలనకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.లావణ్య మంగళవారం చర్యలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధి లో రెండు రోజుల పాటు పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. స్థానిక 15 వార్డులో దోమల నిర్మూలనకుయాంటీ లార్వా, ఇనెక్ట్స్, తెల్ల పురుగు నివారణ కొరకు కెమికల్ తిమో ఫాస్‌ను పారిశుధ్య కార్మికులు స్ప్రెయింగ్ చేశారు.

నగదు, బంగారం చోరీపై కేసు

ప్రజాశక్తి-కొత్తపేట

అవిడి గ్రామంలోని ఒక ఇంట్లో నగదు, బంగారం చోరీ అయినట్లు మంగళవారం కొత్తపేట ఎస్ఐ వి.మణికుమార్ తెలిపారు. అవిడి గ్రామానికి చెందిన ధూళి వెంకటేశ్వరరావు, ధూళి సుబ్రహ్మణ్యం అన్నదమ్ములు. వీరుఒకే ఇంట్లో వేరు వేరు పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. సోమవారం ఐ.పోలవరం మండలం తిల్లకుప్ప గ్రామంలో తమ బంధువుల ఇంటి వద్ద పూజకు కుటుంబం మొత్తం వెళ్లారు. తిరిగి మంగళవారం వచ్చేసరికి అన్నదమ్ములు నివాసముంటున్న పోర్షన్ల బయట తలుపులు పగలగొట్టి ఉన్నాయి. బీరువా వద్దకు వెళ్లి చూడగా వెంకటేశ్వరరావు సంబంధించి రూ.45 వేల నగదు మూడున్నర కాసుల బంగారం, తన సోదరుడైన సుబ్రహ్మణ్యం ఇంట్లో రూ.95 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు గుర్తించారు.స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

పంట కాల్వలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గోవలంక గ్రామానికి చెందిన 14 నెలల చిన్నారి మోర్త నాన్సీ పంట కాల్వలో పడి మృతి చెందినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. ఎఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గోవలంక గ్రామానికి చెందిన మోర్త వేణుగోపాల్, రమ్య దంపతుల ఏకైక కుమార్తె ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న పంట కాలవలో పడినీట మునిగింది. ఇంటి పని చేసుకుంటూ ఉండగా తనకు తెలియకుండా తన చిన్నారి పంట కాలవ వద్దకు వెళ్లి అసువులు బాసిందని తల్లి రమ్య బోరున విలపించింది.

ఆటోను ఢీకొన్న గ్రావెల్ లారీ

ప్రజాశక్తి-మండపేట

గ్రావెల్ లోడు లారీ మంగళవారం ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. మండలంలోని ద్వారపూడి వైపు నుంచి మండపేటకు వస్తున్న గ్రావెల్ లోడు లారీ తాపేశ్వరంలోని అర్తమూరు తూము వద్దకు వచ్చేసరికి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎత్తు ఎక్కేంచే క్రమంలో ఒకసారిగా వెనక్కి రావడంతో వెనక ఉన్న ఆటోని ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లి ఈ ఆటోలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

హత్యాయత్నంపై వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక వ్యక్తిని హత్య చేయడానికి ప్రయత్నించిన వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు వివరాలు ప్రకారం.. ర్యాలీ గ్రామానికి చెందిన దిడ్ల సురేష్‌ను అదే గ్రామానికి చెందిన కటారి రాజ్ కుమార్ హతమార్చాలని కున్నాడు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం సురేష్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించాడు. తటిలో తప్పించుకున్న సురేష్ పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ మంగళవారం రాజ్‌కుమార్ అరెస్ట్ చేసి కొత్తపేట జెఎఫ్ సిఎం కోర్టులో హాజరు పరిచారు. రాజ్‌కుమార్‌కు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నుంచి చోడవరం వెళ్లే రోడ్డు లోఒక గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సుమారు 56 సంవత్సరాలు వయసు ఉంటుందని అంచనా వేశారు. చోడవరం రోడ్, ఆర్‌టిసి కాంప్లెక్స్ దాటిన తరువాత, రామచంద్రపురం వద్ద చనిపోయి ఉన్నాడని విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మతుని ఒంటిపై తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, నాచు రంగు ఫాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి యొక్క వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఈ క్రింది పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్లకు 94407 96589 08857 242333 వివరాలు తెలియ చేయాలని రామచంద్రపురం ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అన్నదానంలో భోజనాలు వడ్డిస్తున్న వారిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు ఉండ్రాజవరం ఎస్ఐ కె.రామారావు మంగళవారం తెలిపారు. తణుకు- టి.వేమవరానికి చెందిన కొందరు యువకులు అకారణంగా పాలంగికి చెందిన మేడూరి మధు కుమార్, మంకు దుర్గారావు, దొడ్డా సూర్యనారాయణలతో గొడవపడి, దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి నిందితులు పాల సంతోష్ కుమార్, కేత మణికంఠ, బండి వెంకటకష్ణలను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

నిధుల దుర్వినియోగం కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

వేట్లపాలెం పంచాయతీలో సుమారు రూ.3.46కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో ప్రస్తుత సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఆమె భర్త చిల్లి మోహన్ రావుతో మాజీ సర్పంచ్ భర్త, మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాసు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, సిబ్బంది సూర్యకళను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు అప్పగించారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం కేసులో మొత్తం 11 మంది వ్యక్తులను నిందితులను గుర్తించగా అయిదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మిగిలినవారు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసు వర్గాలు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సిఐ కె.దుర్గా ప్రసాద్ చెప్పారు.

బాణసంచా సీజ్

ప్రజాశక్తి -కరప

ప్రభుత్వ అనుమతులతో బాణసంచా తయారు చేస్తున్న కేంద్రాల్లో డిఎస్‌పి ఎమ్. మురళీకష్ణ రెడ్డి, కాకినాడ రూరల్ సిఐ కె.శ్రీనివాసు, ఫైర్ ఎస్ఐ యేసు బాబు, కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. వేళంగి గ్రామంలో నానాజీ ఫైర్ వర్క్స్ నందు పరిమితికి మించి మందు గుండు తయారు చేయడంతో ఆ షాపును మధ్యవర్తుల అనుమతితో సీజ్ చేశామని రామకృష్ణ తెలిపారు.

అదుపు తప్పిన కారు

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం దర్గా సెంటర్ సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి 4 బైకులు, ఒక ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. దర్గా సెంటర్ నుండి ఫ్లీడర్ల వీధిలో కారు వెడుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు అక్కడికి వెళ్లి గాయపడిన వారిని స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పట్టణ పరిధిలో సోమవారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకొని వారిని మంగళవారం కాకినాడ కోర్టులో హాజరు పరచారు. న్యాయస్థానం వారికి ఒక్కొక్కరికి రూ.10వేలుగా మొత్తం రూ.40వేలు జరిమానా విధించడం జరిగిందని సామర్లకోట సి. ఐ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు.

యానాం వార్తలు

ఇండోర్ స్టేడియంలో టిటి పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్ 14 విభాగంలో రాజీవ్ గాంధీ హైస్కూల్ ప్రథమ స్థానం సాధించగా, కామిశెట్టి వరప్రసాద్రావు నాయుడు గవర్నమెంట్ హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. అండర్ 17 బాలుర విభాగంలో రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రథమస్థానం సాధించగా డాక్టర్ కె ఆర్ నారాయణ హైస్కూల్ ద్వితీయ సాధించింది. ఈ జోనల్ గేమ్స్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిటి నక్కల సుబ్బన్న, ఐవికె.మోహన్, కొప్పనాతి భాస్కర్, వెనకోటి సన్యాసిరావు, జె.చంద్రశేఖర్, చింతం రామకష్ణ, పాము సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్ఎఒ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి బదిలీ ఆర్డర్స్‌ను మిల్క్ బాయిలర్స్ లెక్క చేయడం లేదు. యానాం హైస్కూల్స్, ప్రైమరీ స్కూల్స్‌లో మిల్క్ బాయిలర్స్‌గా 21 ఏళ్ల నుంచి 42 మంది పనిచేస్తున్నారు. ఈ 42 మందిని వివిధ స్కూల్స్‌కి పరిపాలనాధికారి మునిస్వామి అక్టోబర్ నెలలో ట్రాన్సఫర్ చేశారు. 35 మంది ఆయా ప్లేసుల్లో జాయిన్ అయ్యారు. ఏడుగురు మాత్రం అదే ప్లేస్ లో కొనసాగుతున్నారు. దీనిపై రాజీవ్ గాంధీ సానిటరీ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కర్రి నాగమణి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్‌ను వారిపిఐ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ను మంగళవారం యానాంలో కవి, హిందీ పండితులు తాతపూడి సోమశేఖర శర్మ, పెద్దింటి లక్షణాచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగురుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంద దేశాలలో వందే విశ్వమాతరమ్ పేరుతో శాంతి సద్భావన యాత్రను రెండేళ్ల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 9న ఆఫ్రికాలోని బోట్స్‌వానాలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం, వంద దేశాల తెలుగు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సద్భావన యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుపాకుల ప్రసాదరావు, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.

పాటంశెట్టి సూర్యచంద్ర దీక్ష విరమణ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని 9 రోజుల నుంచి జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.సూర్యచంద్ర చేపట్టిన నిరవధిక దీక్ష మంగళవారం రాత్రి విరమించారు. జగ్గంపేట మండలం రాజపూడి వద్ద చేస్తున్న సూర్యచంద్ర దీక్ష శిబిరం వద్ద జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నాయకులు చేరుకుని సూర్యచంద్రతో దీక్షను విరమింపజేశారు.

విజిలెన్స్ వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో అవినీతిపై అవగాహన వారోత్సవాలు ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం డిఎస్‌పి కె.లతాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవర్ గ్రిడ్ ఉద్యోగులందరూ అవినీతికి తావు లేకుండా అంకిత భావంతో పని చేయాలన్నారు. ఏటా అవినీతి అవగాహన వారోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పించడం ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగావ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు మరియు స్లోగన్ పోటీలు నిర్వహించారు. డిజిఎం సత్య వర్ధన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌వి.కుమార్ జె.కోటేశ్వరరావు, ఎఎస్ఎన్.మూర్తి ఉద్యోగులు పాల్గొన్నారు.

సుంకరపాలెంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం సుంకర పాలెం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో పలు చోట్ల చెత్త పేరుకుపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, చెత్తను తొలగిస్తున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలు దోమల వల్ల ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుంకర గోపి, కుడుపూడి సుబ్రహ్మణ్యం, గుత్తుల వెంకటరమణ, గుత్తుల వాసు, పలివెల పరమానందం పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కాకినాడ

నీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెప్మా పీడీ బి.ప్రియంవద పేర్కొన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మెప్మా నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నీటి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపిక చేసిన 50 మంది అమృత్ మిత్రాలతో స్థానిక వాటర్ వర్క్స్ ఆవరణలో మంచినీటి వనరులను సంరక్షించుకోవలసిన ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముడి నీటిని శుద్ధి చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్న విధానాన్ని వీరికి వివరించారు. ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి నీటిని శుద్ధి చేసే విధానాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ ప్రియంవద మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఇ శ్రీనివాస్, మెప్మా మిషన్ మేనేజర్ దేగల వెంకట్రాజు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

'క్రియ' ఆధ్వర్యాన సైన్స్ ప్రయోగాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

సివి రామన్ జయంతి సందర్భంగా స్థానిక రామారావు పేటలోని సైన్స్ సెంటర్‌లో క్రియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు చేయడంలో అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ 1930 తర్వాత నేటి వరకు విజ్ఞాన శాస్త్రంలో భారతదేశానికి ఒక్క నోబుల్ బహుమతి కూడా రాలేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడం ద్వారా వారిని పరిశోధన వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాత వాటర్ బాటిల్స్, నీరు, లేజర్ లైట్లు ఉపయోగించి కాంతి పరిక్షేపణం, టిండాల్ ప్రభావం వంటి అంశాలను ఈ ప్రయోగాల ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారన్నారు.

బాల బాలికలకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు, ఐఇఆర్‌పిలకు, ఐఇడిఎస్ఎస్ టీచర్లకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమకూర్చిన ట్యాబ్‌లను ఎంపీ వంగా గీతాతో కలిసి కలెక్టర్ మంగళవారం అందజేశారు.

దీపావళి నేపథ్యంలో భద్రతపై సమీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

దీపావళి పండుగ నేపథ్యంలో భద్రతా అంశాలపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, కార్మిక శాఖల అధికారులతో కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ మంగళవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి బాణాసంచా తయారీదారులు, విక్రయదారులు సురక్షితమైన వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు అన్ని ప్రామాణిక భద్రతా చర్యలను పటిష్టంగా పాటించాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో వృద్ధులు, మహిళలు, బాలలతో పనిచేయించ కూడదని, శిక్షణ పొందిన కార్మికులను మాత్రమే నియమించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌పి పడాల వెంకట మురళీకృష్ణా రెడ్డి, అగ్నిమాపక అధికారి డివి.సుబ్బారావు, తహశీల్దారులు, సిఐలు, తయారీదారులు, విక్రేతలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఉపాధి హామీ పనుల్లో చేసిన అక్రమాలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు చేపట్టిన సామాజిక తనిఖీలో వెలుగు చూశాయి. పలు గ్రామాల్లో ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడ్డారని గుర్తించినట్టు డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి వసంత మాధవి, హెచ్ఆర్ మేనేజర్ రాజేష్, ఎంపిడిఒ పి.వెంకటనారాయణ, ఎపిఒ రాజబాబు పాల్గొన్నారు

ఓటరు నమోదుకు 374 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కొత్తగా ఓటరు నమోదు కోసం 374 అప్లికేషన్లు అందాయని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారు 132 అప్లికేషన్లు, ఓటర్ జాబితాలో మార్పుల కోసం 184 అప్లికేషన్లు, చిరునామా మార్పు కోసం 92 అప్లికేషన్లు వచ్చాయన్నారు. దీనికి సంబంధించిన వివరాలన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఏమి సాధించారని వైసిపి యాత్ర'

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కేవలం పదవుల పంపకం కోసం కార్పోరేషన్లు పెట్టి బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీలను అణగదొక్కిన వైసిపికి సామాజిక సాధికార యాత్ర చేసే హక్కు ఉందా అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మీ సత్యనారయణ మూర్తి ప్రశ్నించారు. మంగళవారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్రకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు నిరసన తెలిపితే బస్సు చక్రాలకింద తొక్కుకుంటూ పోతామన్న అనిల్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగంలో ఎవరికైనా నిరసన తెలిపే హక్కు ఉంటుందని చెప్పారు. అనతికాలంలోనే ప్రజలు తమ బ్రాహ్మాస్త్రమైన ఓటు హక్కుతో వైసిపిని తొక్కేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాతపూడి రామకృష్ణ, కాళ్ల శ్రీను, మట్టా ప్రకాష్ గౌడ్, అచ్యుత్, చల్మాజీ, వీరబాబు, పలివెల గాయత్రి పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఆధ్వర్యంలో 'జన సురక్ష'

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బండారులంక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఇందుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాళిని అధ్యక్షతన జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ (వ్యవసాయం) కె.ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్‌బిఐ అందిస్తున్న వివిధ పథకాలు, రుణాలు, ఇన్సూరెన్స్ స్కీముల గురించి సమగ్రంగా వివరించారు. రీజనల్ మేనేజర్ గున్నేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఎస్‌బిఐ పథకాలను ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు.

కార్యక్రమంలో ఎస్‌బిఐ బండారులంక చీఫ్‌మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, బ్యాంకు మిత్ర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ వందన సమర్పణ చేశారు.

రామచంద్రపురంలో మొత్తం 1,98,001 ఓటర్లు నమోదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం అసెంబ్లీ నియోజక వర్గం 42లో మొత్తం 1,98 001 ఓటర్లు నమోదై ఉన్నారని రెవెన్యూ డివిజినల్ అధికారి సుధాసాగర్ తెలిపారు. మంగళవారం రామచంద్రపురం నియోజకవర్గం లోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు మండల వారీగా కాపీలను అందజేశారు

ఘనంగా సివి.రామన్ జయంతి

ప్రజాశక్తి-మండపేట

స్థానిక సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత, భారతరత్న సర్ సివి రామన్ జయంతిని ప్రధానో పాధ్యాయులు ముత్యాల మాణిక్యాంబ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రామన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు


ప్రజాశక్తి-కొత్తపేట

అర్హులందరికీ పథకాలు అందుతాయని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 195వ రోజు మండల పరిధిలోని పనసలదొడ్డి, చిన్నమెరక, పెద్దమెరక కండ్రిగ గ్రామపంచాయతీ పరిధిలోని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకూ వెళ్లి సిఎం జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివద్ధి గురించి వివరించారు అయిన వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

లొల్ల గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్‌కు గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం తండ్రి. వెంకట్రావు జ్ఞాపకార్థం రెండు కంప్యూటర్లను మంగళవారం ప్రధానోపాధ్యాయులకు బహూకరి ంచారు. అలాగే విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, మరియు గ్రామ పెద్దలు మేడిత సత్తిపండు, దాట్ల సూర్యనారాయణ రాజు, కల్లూరి సత్యనారాయణ మూర్తి, కల్లూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

విద్యార్థులకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-కాట్రేనికోన

అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలను ప్రభుత్వ సంస్థ లు ఆధ్వర్యంలో మంగళవానం ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాట్రేనికోన బ్రాంచ్ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలతో పాటు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు మంగళవారం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ పి.మోహన్ రావు తదితరుల చేతుల మీదుగా కళాశాలలో బహుమతులను అందజేశారు.

పారిశుధ్య లోపంపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం పంచాయతీ పరిధిలో పారిశుధ్య లోపంపై ఎపి పిఆర్అండ్ఆర్‌డి స్పెషల్ కమిషనర్ సిరికి మంగళవారం లెటర్ ద్వారా తెలియపరిచినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకరరావు తెలిపారు. ఈ విషయమై సర్పంచ్ మరియు అఖిలపక్ష నాయకులు జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకువెళ్లామని ఈనెల 3న పంచాయతీ ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. అయినా స్పందన కాన రాలేదని లెటర్‌లో పేర్కొన్నారు. చెత్త పేరుకుపోవడంతో అనారోగ్యం పాల్పడుతున్నారని పేర్కొనగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి త్వర లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

కుష్టు బాధితులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం లెప్రసీ కాలనీలో మంగళవారం యూనివర్సల్ చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 38 కుష్టు బాధిత కుటుంబాలకు 26 కేజీలు చొప్పున బియ్యం పంపిణీ చేశారు. యూనివర్సల్ జి.మినిస్ట్రీ డైరెక్టర్ బిషప్ సంతోష్ బాబు, ప్రేమ్ భూషణ్, డేవిడ్ ఫాల్, కనికెళ్ళ కనకరత్నం, తదితరులు పాల్గొన్నారు.